ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 10-10-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈశ్వరుడు మన హృదయములోనేఉన్నాడు. ఈశ్వరుడు మనహృదయంలోనే ఉన్నప్పటికి మనకుఉన్న దేహవాసనవలన, లోకవాసనవలన, శాస్త్రవాసనవలన ఆయనమనకు తెలియటంలేదు. మనం ఎంత సాధన చేసినా, ఎన్నిశాస్త్రములు చదివినా ఈవాసనాత్రయం క్షీణిస్తేనేగాని ఈశ్వర సాక్షాత్కారము కలుగదు. సమానదృష్టికలిగి ఉండటమే యోగము అనిభగవంతుడుచెప్పాడు. రూపదృష్టి, నామదృష్టి తగ్గితే సమాన దృష్టికలుగుతుంది ఇతరులు మనగురించి ఏమనుకుంటున్నారు అనేభావననీకుఉంటే లోకవాసన పెరుగుతూ ఉంటుంది. ఇతరులునీగురించి ఏమైనాఅనుకొన్నా వారిఅహంభావనే అనుకొంటుంది. ఇతరులు మీగురించి ఏమనుకొంటున్నారు అనే ఆలోచన తొలగించుకోగలిగితే మీకు లోకవాసనతగ్గుతుంది, సమానదృష్టి కలగటానికి లోకవాసనతగ్గాలి, మనకులాలు వేరు అవ్వవచ్చు, మతాలువేరుఅవ్వవచ్చు మనదేహాల రంగులువేరుగాఉండవచ్చు, మనస్సులోఉన్నగుణాలువేరుగాఉండవచ్చు గాని అందరిహృదయంలో ఉన్నచైతన్యం ఒక్కటే, ఆచైతన్యదృష్టి ఎవరికిఉందో వారికి సమానదృష్టికలుగుతుంది. రూపాలు వేరైనా, గుణాలు వేరైనా, నామాలు వేరైనా, అందరిహృదయాలలో ప్రకాశిస్తున్న స్వచ్ఛమైన వస్తువును ఎవరైతే చూడగలుగుతున్నారో వారికిసమానదృష్టికలుగుతుంది.

జ్ఞానిఏమిచేస్తాడుఅంటే దుష్టులపట్ల ఉదాసీనంగా ఉంటాడు. దుష్టులను ఏమివిమర్శించడు. సత్పురుషుల పట్ల ప్రేమగాఉంటాడు అంటే వాడికి సమానదృష్టి లేదుఅనికాదు. మనలోను దేవుడు ఉన్నాడు, పాములోనుదేవుడుఉన్నాడు, అలాగని పామును భుజానవేసుకుని తిరగము. సమానదృష్టి అనేది హృదయానికిసంబంధించినవిషయం. భాహ్యమైనమాటలవలన వచ్చేదికాదు, భగవాన్ ఒకరితో కోపంగామాట్లాడేవారు, ఒకరితో ప్రేమగా మాట్లాడేవారుఅలాగని అక్కడసమానదృష్టి లేదుఅనికాదు. వాసనక్షయంఅవ్వటంకోసం ఎవరిలో ఏబలహీనత ఉందో ఆబలహీనత తొలగించటంకోసం ఒకరిదగ్గరకోపం నటించేవారు. కోపంనటిస్తేనేగాని వారిబలహీనతపోదు, ఒకరితో ప్రేమగామాట్లాడేవారు, ప్రేమగామాట్లాడినా వారిబహీనత పోతుంది. ఆయనకోపంకూడా అనుగ్రహమే. ప్రేమకూడాఅనుగ్రహమే. ప్రతీశరీరానికిరూపంఉంటుంది. రూపంలేకుండాశరీరంఉండదు అలాగే దేవునిరూపం ఏమిటి అంటే అనుగ్రహమే. సమానదృష్టికలగటానికి సత్వగుణంసంపాదించాలి.

శరీరమునకు రోగములువస్తే కంగారుపడుతున్నారు.శరీరానికివచ్చేరోగాలు తాత్కాలికమైనవి శరీరానికివచ్చేరోగాలు శరీరంకాలిపోయినపుడు ఆరోగములుకూడా కాలిపోతాయి అసలురోగము అదికాదు చనిపోవటం, పుట్టటం అనేది అసలురోగము, ఆరోగమునుతగ్గించుకోండి ఆరోగమాను తగ్గించుకొంటే శరీరంరాదు. శరీరం రాకపోతే రోగములేదుఅన్నారు. చనిపోవటం పుట్టడం అనే అసలురోగమును తగ్గించుకోవటానికి ప్రయత్నంచేయండి. ఈరోగమునుతగ్గించుకోవటానికి యోగముఅవసరము,యోగంలేకుండా ఈరోగముతగ్గదు. ఎవరైనా విమర్శించినా ఆవిమర్శకూడా

స్తోత్రమేఅనుకోవాలి. అప్పుడు మనమనస్సు చలించదు. సమానదృష్టిఉన్నవాడు యోగితో సమానము, జ్ఞానితోసమానము. సమానదృష్టి కలిగినప్పుడు మనస్సుపల్లబడుతుంది. ఎప్పుడైతే మనస్సుపల్లబడిందో వాడికి అంతర్దృష్టికలుగుతుంది ఎప్పుడైతే అంతర్దృష్టికలిగిందో మనస్సుహృదయంలోనికివెళ్ళి అక్కడస్థిరపడి హృదయకారంచెందుతుంది. అప్పుడుహృదయంలోఉన్న సత్యవస్తువేతానుగానీకు వ్యక్తమవుతుంది ఈశ్వరసాక్షాత్కారానికి కావలసిన సామాగ్రిలో సమదృష్టిఒకటి.ఎండలో చెట్టునీడన కూర్చుంటే ఎంతచల్లగాఉంటుందో సమదృష్టికలిగినవాడికి ప్రకృతివేగంఎలా ఉన్నా అంత చల్లగాఉన్నట్లు అనిపిస్తుంది. సమానదృష్టి కలగటానికి కామక్రోదములవేగం తగ్గించుకోమని భగవంతుడుచెప్పాడు.మనకుకోరికలు ఎక్కువగావస్తూఉంటాయి, మాటమాటకు కోపంవస్తూ ఉంటుంది. అంటేమనకు రజోగుణం ఉన్నట్లు గుర్తు. రజోగుణంనుండే కామక్రోధములు పుట్టుకునివస్తాయి. నీహృదయంలో శాంతిలేదు, సుఖంలేదు, లోకంలోనేసుఖం,శాంతి ఉందని ఈకామక్రోధములే నీకుఅనిపింపచేస్తాయి నీవు ప్రకృతి ప్రవాహములో కొట్టుకొనిపోవటానికి ఎవరోఇతరులుకారణం కాదు, ఈకామక్రోధములే కారణం ఇతరులనువిమర్శించేబదులు, నిన్నునీవు విమర్శించుకొని ఈకామక్రోధములనుండి విడుదలపొందు. ఇతరులనువిమర్శించుటవలననీకురజో గుణంపెరుగుతుంది.నిన్నునీవు విమర్శించుకొని నీబలహీనతలనుండివిడుదలపొందితే నీకు సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం దేవునిదగ్గరకు దారిచూపిస్తుంది, నీనాశనానికి ఎవరోకారణంకాదు, నీరజోగుణంనుండిపుట్టివచ్చేకామక్రోదములే కారణం, ఈకామక్రోదములను సంతృప్తిపరస్తు వేలాదిజన్మలు వెళ్లినా వాటినిపూర్తిగాసంతృప్తి పరచలేవు. కామక్రోధములను వదిలించుకొన్నవాడు సుఖసముద్రంలోప్రవేసిస్తాడు గానివాటిని ఎవడైతే వదిలించుకోలేడో వాడువాటిని సంతృప్తి పరచలేడు, అవిఆజన్మకు ఆజన్మపెరిగిపోతూ ఉంటాయి ఇంతకాలమునుండి జీవుడు మనలను సంతృప్తి పరస్తున్నాడుకదా ఇంకమనం తప్పుకొందాముఅని అవిఅనుకోవు సంతృప్తిపరచేకొలది అవి పెరిగిపోతాయి ఈకామక్రోధములను సంతృప్తిపరచడంవలన నీకునుఖంరాదు, అవిఅశాంతిని తీసుకువస్తాయి. వీటిని కంట్రోలు చేయడంవలన నీకుసుఖంకలుగుతుంది, కామక్రోధములను సంతృప్తిపరచి వాటినిజయించినవాడు ఇంతవరకు ఈసృష్టిలో ఎవడూలేడు. వాటిని వదులుకున్నవాడు వాటిని జయిస్తాడు, భక్తివలన బంధంనుండి బయటపడగలము భక్తివలన భగవంతుని స్వరూపమును పొందగలము అయితే ఆభక్తి అకారణభక్తిఅయిఉండాలి.

పూర్వజన్మలో నీవు చేసినపనులే వాసనలక్రింద ఏర్పడతాయి. నీదుఃఖానికి కారణం, నీపునర్జన్మకు కారణం వాసనలే, నీమనస్సును బాహ్యముఖానికి త్రిప్పేదికూడా నీవాసనలే. నీ ప్రయత్నం వలన అణగనివాసన గురువుయొక్క సన్నిధిలో అది అణుగుతుంది. వాసనాక్షయం అయినపుడు సమాధిస్థితి కలుగుతుంది. భగవంతుని నామం చేసేటప్పుడు ప్రీతితో, ప్రేమతో, భక్తితో చేయాలి. అప్పుడు ఫలితం మీకు తెలుస్తుంది. సత్పురుషుల దగ్గర కూర్చొన్నప్పుడు నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. ప్రకృతి మనుషుల దగ్గర ఉంటే నీమనస్సుకు బాహ్యదృష్టి కలుగుతుంది. అంటే లోకదృష్టి పెరిగిపోతూ ఉంటుంది. ఇతరులు నా గురించి ఏమనుకొంటున్నారు అనే గొడవ వదలనంతకాలము లోకదృష్టి తగ్గదు.

ఇప్పడు జీవుడు నీకు ఏవిధంగా అనుభవంలో ఉన్నాడో అదేవిధంగా గురువు సమక్షంలో ఉన్నప్పడు

నీలోపల ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. అందులోస్థిరంగా ఉండాలంటే నీవు అభ్యాసం చేయాలి. గురువు సమక్షంలో శాంతి కలుగుతుంది. హృదయంలో ఉన్న వస్తువు గురించి కొద్దిగా గురువు నీకు తెలియజేస్తాడు. ఆవస్తువుకు సంబంధించిన సుఖాన్ని కొద్దిగా నీకురుచి చూపిస్తాడు. దానిని స్థిరం చేసుకోవటానికి కొంతసాధన చేయాలి. సాధన చేయటానికి కావలసిన బలాన్ని కూడా గురువే ఇస్తాడు. నీవు హృదయంలో స్థిరపడినపుడు నీకు మోక్షస్థితి కలుగుతుంది. చీకటిగా ఉన్నప్పడు ఇక్కడ ఉన్న వస్తువులు మనకు కనబడవు. బాటరీలైటు వేసుకొని వెతుకుతాము. లైటు ఆవస్తువు మీద పడినప్పడు ఆవస్తువు మనకు కనబడుతుంది. అదేవిధంగా సత్యవస్తువు మనహృదయంలోనే ఉన్నా దాని గురించి మనకు తెలియటంలేదు. ఆవస్తువును ఎరుకలోనికి తీసుకొని రావటానికి గురువు బాటరీలైటులాగ ఉపయోగపడతాడు. గురువుచేసే పని అదే. ఆవస్తువు ఒక్కటే నిజం అన్న సంగతి ఆవస్తువు అనుభవంలోనికి వచ్చాక నీకు తెలుస్తుంది.

చనిపోవటం, పుట్టటం అంటే మీరు కంగారుపడకండి. దీనిగురించి భగవాన్ చాలా సింపుల్‌గా చెప్పారు. ఇప్పడు మనం జాగ్రదావస్థలో ఉన్నాము. రాత్రినిద్రపోతాము. మరల ఉదయం జాగ్రదావస్థలోనికి వస్తాము. జాగ్రదావస్థలోనుండి నిద్రావస్థలోనికి వెళ్ళటం మరణం వంటిది. మరల నిద్రావస్థలో నుండి జాగ్రదావస్థలోనికి రావటం పుట్టటం వంటిది. ఇందులో పెద్ద విశేషం ఏమీలేదు అని చెప్పారు. లోపల అజ్ఞానం అనేతాడు తెగేవరకు ఇవి మామూలుగా జరుగుతూనే ఉంటాయి. ఎవరైనా పొగిడితే సంతోషిస్తాము, ఎవరైనా విమర్శిస్తే దుఃఖపడతాము. వీటివలన అహంభావన పెరిగిపోతుంది. ఏదో పూజ చేస్తున్నాము,జపం చేస్తున్నాము అని అనుకోవద్దు. చేసుకోండి మంచిదే. కాని ఎవరైనా పొగిడినపుడు మీ మనస్సు ఎలా ఉంటోంది, ఎవరైనా విమర్శించినపుడు మీమనస్సు ఎలా ఉంటోంది అని చూసుకోండి. మీ మనస్సును మీరు పరిశీలన చేసుకోండి. మిమ్మల్ని మీరు విమర్శించుకోండి. దీనివలన మీరు బాగుపడతారు. ఇతరుల భావాలమీద ఆధారపడి జీవించవద్దు.

ఉన్నది అనుగ్రహమే. అనుగ్రహం వలననే నీమనస్సు అణుగుతుంది. నీతెలివితో నీవు కొంత ప్రయత్నం చేసుకోవచ్చు, దానివలన కొంతదూరం ప్రయాణం చేయవచ్చు. అనుగ్రహం వలననే నీ మనస్సు అణుగుతుంది. గురువు అంటే ఎవడు అంటే నీహృదయంలో ఉన్న సత్యవస్తువే రూపం దాల్చివస్తుంది. బాహ్యంగా ఉండి నీకు సహాయసహకారములు అందివ్వటం కోసం సత్యవస్తువే రూపం ధరించి వస్తుంది వాడే గురువు. నీహృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉంటే మంచిదే, అది అందరికి సాధ్యంకాదు. అందువలన గురువుమగాని, అవతారపురుషునిగాని పట్టుకొంటే వారితో మానసిక అనుబంధంవలన నీవు తరిస్తావు. మనం తరిస్తామా, లేదా అనే సందేహం వద్దు. నీవు ఏమి చేస్తున్నప్పటికీ, నీపరిస్థితులు ఎలా ఉన్నా గురువుతో సాంగత్యం విడిచిపెట్టవద్దు. గురువుతో మానిసిక అనుబంధం పెట్టుకొంటే నీఅజ్ఞానమునకు నిప్పపెడతాడు. అప్పడు అది నాశనం అవుతుంది. ఒక వస్తువును అంటించాము అనుకోండి అది పూర్తిగా కాలటానికి కొంత టైము పడుతుంది. అలాగే గురువు అనుగ్రహంలో పడినవాడు తరించటానికి ఒకోసారి కొన్ని జన్మలు పట్టవచ్చు. వాడు తప్పక తరించబడతాడు గాని గురువు అనుగ్రహంలోనుండి బయటపడటానికి అవకాశంలేదు. నీవు దేహానికి, మనస్సుకు పరిమితమై ఉంటావు. ఎన్ని జన్మలు ఎత్తినా దేహంచుట్టూ, మనస్సు చుట్టూ, నీతెలివి చుట్టూ తిరుగుతూ ఉంటావు. కాని నీతెలివికి, నీమనస్సుకు, నీదేహానికి అతీతంగా ఉంటాడు గురువు. అందువలన గురువుయొక్క స్థితి నీకు తెలియదు. గురువు సహాయంతో నీహృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు గోచరమవుతుంది.

దేహాలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. కామక్రోధములు వస్తూఉంటాయి, పోతూ ఉంటాయి. అవి ఎలాగ వచ్చాయో అలాగే పోతాయి. కాని గురువుతో సాంగత్యమును విడిచిపెట్టవద్దు. నాకు అది కావాలి, ఇది కావాలి అని గురువును అడగనక్కరలేదు. ఆయన సమక్షంలో ఉంటే నీవు అడగకుండానే ఆయన అనుగ్రహం, శాంతి, సుఖం నీకు అందుతూ ఉంటాయి. నీవు గురువుకు ఏదైనా సేవ చేయవచ్చు. సేవచేయటం వలన నీకే లాభం. దానివలన నీకు ఆత్మనిష్ఠ కలుగుతుంది. మనకు కొంత లోకజ్ఞానం ఉంటుంది. మాకు జ్ఞానం ఉంది అనుకొంటాము. మనకు ఆత్మజ్ఞానము కలిగిన తరువాత ఇంతవరకు మనకు ఉన్నది అజ్ఞానం అని అప్పుడు తెలుస్తుంది. ఆత్మజ్ఞానము కలిగే వరకూ జ్ఞానం కాని దానిని జ్ఞానం అనుకొని చనిపోతూ, పుడుతూ ఈ చక్రంలో తిరుగుతూ ఉంటాము. ఏదైతే సత్యమో ఆ వైపుకు నీ ముఖాన్ని గురువు త్రిప్పుతాడు. ఆ వస్తువును పొందడానికి తగిన శక్తిని ఇస్తాడు. మార్గము గురువే, గమ్యము గురువే. గురువు అంటే ఏమిటో నీకు అవగాహన అయినప్పుడు నీవుఎక్కడఉన్నా ఒక్కటే. నీకుఅవగాహన లేనప్పుడు బాహ్యమైన గురువుతో సహవాసం అవసరమే. గురువు యొక్క దేహానికి దగ్గరగా ఉండటం కంటే, దేహానికి దూరంగా ఉండి మానసిక అనుబంధం పెట్టుకోవటం మంచిది. దేహం ప్రధానం కాదు. దేహం జడ వస్తువు. నేను ఉన్నాను అని దేహం చెప్పటం లేదు. దేహము నేను అని మనస్సు చెపుతోంది. నీదేహం ఎక్కడ ఉన్నా ఈ దేహము నేను అని ఏ మనస్సు అయితే చెపుతోందో ఆ మనస్సుతో గురువుతో అనుబంధం పెట్టుకుంటే నీ బంధం తెగిపోతోంది. శారీరకంగా దగ్గరగా ఉండటం కంటే మానసిక అనుబంధం ముఖ్యం. గురువు అంటే పెద్ద చుట్టము. బాహ్యంగా ఉన్న గురువుతో మానసిక అనుబంధము పెట్టుకొంటే అది నీమనస్సును హృదయం లోనికి నెట్టివేస్తుంది. అప్పుడు నీమనస్సు కరిగిపోతుంది. అప్పుడు హృదయంలోఉన్న సుఖం నీకు తెలుస్తుంది. అప్పుడు చావులేని స్థితికిఎదిగివెళ్ళిపోతావు. సత్యవస్తువును నీవు గ్రహించకపోయిన అది గ్రహించినవారితో కలసి ఉండుట అవసరం. అందువలన సత్యవస్తువు గ్రహించిన వారితో కలసి ఉండటం తప్పని సరిగా అలవాటు చేసుకో. ఎందుచేతనంటే సంసార సముద్రం దాటించడానికి సత్సంగం వంటి నౌక మూడు లోకములలోను లేదు అన్నారు ఆచార్యులువారు, సంసారసముద్రం దాటించడానికి అనేక నౌకలుండవచ్చు. కాని సత్సంగమనే నౌక నిన్ను సురక్షితంగా సంసార సముద్రం దాటిస్తుంది. అందువలన సత్‌పురుషులతో మీకు సహవాసం ఉంటే సరే. లేకపోతే సత్‌పురుషులతో సహవాసము వెదుక్కోండి.

ఈలోకములోనికి అనేక జీవులు వస్తూఉంటాయి. పోతూఉంటాయి. కాని బ్రహ్మం మటుకు మారదు. ఈలోకముమనకు కనబడుతుంది. ఈలోకానికి ఆధారంగా ఉన్న బ్రహ్మం మనకు కనబడుటలేదు. మనకు కనబడుటలేదు కాబట్టి బ్రహ్మమే లేదు అనుకొంటున్నాము. చెట్టు మనకు కనిపిస్తుంది దానికి ఆధారంగా ఉన్న వేరు మనకు కనుబడుట లేదు. వేరు మనకు కనుబడుట లేదు కదా అని వేరు లేదని చెపుతామా? చెప్పం. అలాగే బ్రహ్మం నీకు కనబడుటలేదు అని బ్రహ్మం లేదని అంటే ఎలా? బ్రహ్మం ఉంది. భగవంతుడు ఉన్నాడా లేడా అని సందేహించేవాడికి ఎన్ని సాధనలు చేసినా మనస్సు పవిత్రం అవ్వదు. భగవంతుని మీద సజీవమైన విశ్వాసం ఉంటే వారి మనస్సు పవిత్రం అవుతుంది. మీకు చెడు అలవాట్లు ఉంటే ఉన్నాయి. ఉన్నాయని అనుకోవద్దు. నెమ్మదిగా వాటిని విడిచిపెట్టడానికి ప్రయత్నం చేయండి.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 14-11-97 న)**